క్లుప్తంగా

పంట నష్టపోయిన రైతులు దరఖాస్తు చేసుకోండి

నకిరేకల్ : ఈదురు గాలులతో నష్టపోయిన పండ్ల తోటల రైతులు పరిహారం కోసం దరఖాస్తులు చేసుకోవాలని నకిరేకల్ క్లస్టర్ ఉద్యానవన అధికారి ప్రవీణ్‌కుమార్ మంగళవారం తెలిపారు. నకిరేకల్, శాలిగౌరారం, కేతేపల్లి మండలాల్లో రైతులు తమ పంట వివరాలతో నకిరేకల్‌లోని వ్యవసాయ ఏడీ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలన్నారు. రైతు పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్ బుక్ జిరాక్స్ ప్రతులను అందజేయాలన్నారు.

హోంగార్డుకు సన్మానం


సలీంను సన్మానిస్తున్న ఎస్పీ

నల్లగొండ: పోలీస్ శాఖలో పదవీ విరమణ పొందినవారి అనుభవాలు అవసరమని ఎస్పీ శరత్ చంద్ర పవార్ అన్నారు. హోంగార్డుగా 34 సంవత్సరాలు సేవలందించి పదవీ విరమణ పొందిన ఎండీ. సలీంను మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సలీం పోలీస్ శాఖ ఫింగర్ ప్రింట్ విభాగంలో ఎనలేని సేవలు అందించారన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రమేష్, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాస్, ఆర్.ఐ శ్రీనివాస్, హోంగార్డు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నేత్రదానం


కార్నియా సేకరిస్తున్న ఐ ఫౌండేషన్ సభ్యులు

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన పడాల వెంకటలక్ష్మి అనారోగ్యంతో మృతి చెందింది. ఐ ఫౌండేషన్ సభ్యులు బాధిత కుటుంబ సభ్యుల అనుమతితో మృతురాలి నుంచి కార్నియాలను సేకరించారు. కార్యక్రమంలో ఐ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సుతారపు రవీందర్, మృతురాలి కుటుంబ సభ్యులు ఉప్పు మధుకర్, శోభారాణి, చామల కిశోర్, శిరీష, లయన్స్ క్లబ్ కోఆర్డినేటర్ చంద్రశేఖర్ చిరునోముల తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు అవగాహన


తాస్కానిగూడెంలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ యాదమ్మ

చండూరు : గర్భిణులు, బాలింతలు మిల్లెట్స్ ఆహారంగా తీసుకోవడం వల్ల ఎన్నో లాభాలు ఉన్నాయని, వాటిని నిత్యం ఆహారంలో భాగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ యాదమ్మ పిలుపునిచ్చారు. పోషకాహార వారోత్సవాల్లో భాగంగా మండలంలోని తాస్కానిగూడెం, బోడంగిపర్తి గ్రామాల్లో గర్భిణులకు, బాలింతకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఆయా కార్యక్రమాల్లో ఉపాధ్యాయురాలు షబానా, ఐకేపీ సీసీ అంజయ్య, పంచాయతీ కార్యదర్శి వెంకటేశం, ఏఎన్‌ఎం శ్రీలత, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ విగ్రహానికి భారీ గజమాల


హనుమంతుడి విగ్రహం వద్ద బీసీ యువజన సంఘం నాయకులు

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణంలోని రామగిరి రామాలయంలోని హనుమాన్ విగ్రహానికి బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు మునాసు ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో మంగళవారం భారీ గజమాల సమర్పించారు. కార్యక్రమంలో మునాస నాగరాజు, మునాస వినయ్, వడ్డెబోయిన వెంకటరమణ, దుడుకు లక్ష్మీనారాయణ, అయితగోని జనార్దన్‌గౌడ్, అప్పల భాస్కర్, అరవింద్, బాతుక సతీష్, వల్లకీర్తి రమేష్, భరద్వాజ, భరత్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

శివారులో డ్రెయినేజీలు అస్తవ్యస్తం

- వీధుల్లో నిలుస్తున్న మురుగు
- దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్న స్థానికులు
- యూజీడీ నిర్మించాలని వేడుకోలు


అక్కలాయిగూడెంలో శిథిలావస్థలో డ్రెయినేజీ


అక్కలాయిగూడెంలోని ఓ వీధిలో..


ముత్యాలమ్మ కాలనీలోని ఓ వీధిలో పారుతున్న మురుగు

నల్లగొండ టూటౌన్ : నీలగిరి మున్సిపాలిటీలోని శివారు కాలనీల్లో మురుగు నీటి వ్యవస్థ సరిగా లేకపోవడంతో ఎక్కడపడితే అక్కడ మురుగు నిలిచిపోయి తీవ్ర దుర్వాసన వస్తోంది. మురుగు దిగువకు వెళ్లే డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడమే ప్రధాన కారణమని ఆయా కాలనీల వాసులు పేర్కొంటున్నారు. కొన్ని కాలనీల్లో మురుగు పలువురు మహిళల మధ్య పంచాయితీకి కూడా కారణమవుతోంది. మున్సిపాలిటీ పరిధిలోని చైతన్యపురి, సూర్యవంశీ కాలనీ–2, రెడ్డి కాలనీ, అక్కలాయిగూడెం, హిమగిరి కాలనీ, ముత్యాలమ్మ కాలనీ తదితర ప్రాంతాల్లో డ్రెయినేజీలు లేకపోవడంతో మురుగు నీరు వీధుల వెంట నిలుస్తోంది. మురుగు నీరు దిగువకు వెళ్లడానికి ఇంటి ఎదుట చిన్న కాల్వలు తీస్తున్న సందర్భంగా తమ ఇంటి ముందుకు మురుగు ఎలా పంపుతారని కొందరు పక్కింటి వాళ్లతో పంచాయితీకి దిగుతున్నారు. ఆయా కాలనీల్లో డ్రెయినేజీ సమస్య జఠిలంగా మారిందని కాలనీల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీధుల్లో మురుగు నిండిపోతుండడంతో పందులు వచ్చి వాటిలో పొర్లడంతో దుర్వాసన వస్తోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

యూజీడీతోనే సమస్యకు పరిష్కారం..

చైతన్యపురి, రెడ్డి కాలనీ, కనకదుర్గ కాలనీ, అక్కలాయిగూడెం తదితర కాలనీల్లో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులు మొత్తం పూర్తయితే సమస్య పరిష్కారం అయ్యే అవకాశం ఉంది. ఇక్కడి మురుగు నీటిని దిగువకు పంపి వేయాలంటే ఈ ప్రాంతంలో మురుగు నీటి శుద్ధి కేంద్రం కూడా నిర్మించాల్సిన అవసరం ఉంది. ఇటీవల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఎస్టీపీకి స్థలం కేటాయించాలని కలెక్టర్‌కు సూచించారు. ఆయా కాలనీల్లో మురుగు నీటి శుద్ధి కేంద్రం నిర్మాణంతోపాటు డ్రెయినేజీల నిర్మాణం పూర్తయితేనే మురుగు నీటి సమస్య తీరనుంది.

దోమలు ఎక్కువగా వస్తున్నాయి



మురుగు నీటి కాల్వ ఉన్నా కిందకు సాఫీగా మురుగు వెళ్లకపోవడంతో డ్రెయినేజీ పూర్తిగా నిండిపోయింది. కొత్త కాల్వల నిర్మాణం చేపట్టి సమస్యకు పరిష్కారం చూపాలి. వీధుల్లో మురుగు నిలవడంతో ఇళ్లలోకి దోమలు ఎక్కువగా వస్తున్నాయి.

– జక్కల నాగరాజు, అక్కలాయిగూడెం

డ్రెయినేజీలు నిర్మించాలి



మా కాలనీలో అందరం నిరుపేదలమే నివాసం ఉంటున్నాం. మట్టి రోడ్డు కావడంతో వాన వస్తే బురదమయంగా మారుతోంది. సీసీ రోడ్డు వేయడంతోపాటు డ్రెయినేజీల నిర్మాణం చేపట్టే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– రమావత్ వాలి, ముత్యాలమ్మ కాలనీ

నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం


తమను ఆదుకోవాలని ఎమ్మెల్యే వీరేశాన్ని వేడుకుంటున్న మహిళా రైతు


టేకులగూడెంలో ధ్వంసమైన తోటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్ : ఈదురు గాలులు, వడగండ్లతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం హామీ ఇచ్చారు. నకిరేకల్ మండలం పాలెం, టేకులగూడెం గ్రామాల్లో ఈదురు గాలులు, వడగండ్లకు దెబ్బతిన్న నిమ్మ, మామిడి తోటలు, కూలిపోయిన ఇళ్లను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సుమారు 600 ఎకరాల్లో తోటలు 100 శాతం ధ్వంసం అయినట్లు అధికారులు అంచనా వేశారని అన్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నష్టపోయిన రైతులకు పరిహారం ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. చెట్లు కోల్పోయిన రైతులకు సబ్సిడీపై రీప్లాంటేషన్ చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. బాధిత రైతు కుటుంబాలకు రాజీవ్ యువ వికాస్‌లో సబ్సిడీ రుణాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట తహసీల్దార్ జమురుద్దీన్, ఉద్యానవన అధికారి ప్రవీణ్‌కుమార్, వ్యవసాయ అధికారి జానిమియా, పీఏసీఎస్ చైర్మన్ నాగులంచ వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ మండల పట్టణ అధ్యక్షులు నకిరేకంటి ఏసుపాదం, లింగాల వెంకన్న, నాయకులు నయీం, యాసా కరుణాకర్‌రెడ్డి, గాదగోని కొండయ్య, నకిరేకంటి నరేందర్, మల్లారెడ్డి, సామ రవీందర్‌రెడ్డి, ఆవుల వేణు తదితరులు ఉన్నారు.

ఫసల్ బీమా పథకాన్ని అమలు చేయాలి


కొనుగోలు కేంద్రంలో ధాన్యం పరిశీలిస్తున్న గోలి మధుసూదన్‌రెడ్డి

చిట్యాల: కేంద్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకాన్ని రాష్ట్రంలో అమలు చేయాలని బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ నాయకుడు గోలి మధుసూదన్‌రెడ్డి డిమాండ్ చేశారు. చిట్యాలలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో సమస్యలు, సౌకర్యాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అన్ని రకాల ధాన్యానికి ప్రభుత్వం రూ.500 బోనస్ అందించాలన్నారు. అకాల వర్షాల వల్ల పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.30 వేల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అసంపూర్తిగా ఉన్న ధర్మారెడ్డిపల్లి, పిల్లాయిపల్లి కాల్వల నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని కోరారు. రైతులకు సబ్సిడీపై యంత్ర పరికరాలు అందించాలన్నారు. కార్యక్రమంలో కిసాన్‌మోర్చా జిల్లా కార్యదర్శి కన్నెబోయిన మహాలింగం, చికిలంమెట్ల అశోక్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు గుండాల నరేష్‌గౌడ్, పార్టీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు అంశల అనిల్‌కుమార్, పల్లె వెంకన్నగౌడ్, జయారపు రామకృష్ణ, కందాటి చంద్రారెడ్డి, భానుక ఉదయ్, నర్రా గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

వీఆర్‌ఏల వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలి


వినతి పత్రం అందజేస్తున్న లక్ష్మీనారాయణ

నల్లగొండ టౌన్: జీఓ నంబర్ 81 ప్రకారం 61 సంవత్సరాలు పైబడిన వీఆర్‌ఏల వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని కోరుతూ వీఆర్‌ఏల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు సీహెచ్ లక్ష్మీనారాయణ, వీఆర్‌ఏ జేఏసీ రాష్ట్ర నాయకుడు కె నగేష్ కుమార్ మంగళవారం కలెక్టరేట్‌లో ఏఓ మోతిలాల్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీఓ నంబర్ 81 అమలు చేయకుండా వీఆర్‌ఏ వారసులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. వీఆర్‌ఏలు పే స్కేల్ కోసం పోరాడుతున్నప్పుడు అప్పటి పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న ఉన్న రేవంత్‌రెడ్డి తమ పోరాటానికి మద్దతు తెలిపి తమ న్యాయమైన సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని, ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినా పట్టించుకోవడం లేదన్నారు. ఇటీవల అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో రెవెన్యూ మంత్రి భూ భారతి తెచ్చిన అనంతరం వీఆర్‌ఏలను పర్మినెంట్ చేస్తామని అన్నారని, ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని కోరారు. కార్యక్రమంలో సుధాకర్, వెంకన్న, మట్టయ్య, రామకృష్ణ, సుధాకర్, మట్టయ్య, మహబూబ్ అలీ, అంజి తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే వ్యాధులు దూరం

నల్లగొండ టూటౌన్ : ఇంటితోపాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే వ్యాధులు దూరం అవుతాయని బీజేపీ సీనియర్ నేత గోలి మధుసూదన్ రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని 19వ వార్డు సంజయ్‌గాంధీనగర్ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో స్వచ్ఛ భారత్ నిర్వహించారు. అదేవిధంగా భక్తాంజనేయ స్వామి ఆలయంలో శుద్ధి కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారం పరిశీలించారు. అనంతరం మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ రేషన్ దుకాణాల ద్వారా సన్న బియ్యం ఇస్తున్నది కేంద్ర ప్రభుత్వమే అన్నారు. కార్యక్రమంలో బీపంగి జగ్జీవన్, మిర్యాల వెంకటేశం, పగిడి మహేష్, రవికుమార్, నారగోని వెంకన్న, చంటి, వివేక్, రమాదేవి పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

నకిరేకల్ : పట్టణంలోని వీటీ కాలనీలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో జరిగిన ప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన పజ్జు కృష్ణ ఇంటిని కాంగ్రెస్ నేత దైద రవీందర్ మంగళవారం సందర్శించారు. రూ.10వేల ఆర్థిక సహాయాన్ని కృష్ణకు అందజేశారు.

ఘనంగా డిగ్రీ విద్యార్థుల వీడ్కోలు వేడుకలు



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

నకిరేకల్ : విద్యార్థులు ఉన్నత చదువులు చదివి జీవితంలో స్థిరపడి కళాశాలకు మంచి పేరు తేవాలని నకిరేకల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బెల్లి యాదయ్య అన్నారు. నకిరేకల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తృతీయ సంవత్సరం విద్యార్థుల వీడ్కోలు వేడుకలను మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పోటీ పడితేనే ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు పోటీని తట్టుకోవాలన్నారు. విద్యార్థి లోకేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నాగు, అధ్యాపకులు ప్రవీణ్‌రెడ్డి, శ్రీనివాస్, హరిత, మధుసూదన్‌రెడ్డి, శంకర్, సతీష్, శివశంకర్, నర్సింహాచారి, ఉపేందర్ పాల్గొన్నారు.

సమగ్ర అభివృద్ధికి నిధులు కేటాయించాలి


వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

కట్టంగూర్ : మండల సమగ్ర అభివృద్ధికి రూ.100 కోట్లు కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజా పోరుబాట పాదయాత్ర మంగళవారం కట్టంగూర్ మండలంలో ముగిసింది. మండలంలోని పిట్టంపల్లి, భాస్కర్లబాయి, చిన్నపురి, ముత్యాలమ్మగూడెం, మాణిక్యాలమ్మగూడెం, సవ్వళ్ల గూడెం, కట్టంగూర్ గ్రామాల్లో సీపీఎం నాయకులు పాదయాత్ర చేపట్టి ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ధర్నాలో వీరారెడ్డి పాల్గొని మాట్లాడుతూ కృష్ణా జలాలు సక్రమంగా అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునేవారు కరువయ్యారన్నారు. మండలంలో ఉన్న ఆసిఫ్ నగర్ కాలువ పూడిక తీసి సాగునీరు అందించాలన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ గుగులోతు ప్రసాద్‌కు అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి పెంజర్ల సైదులు, చిలుముల రామస్వామి, మోహన్, రమేష్, గర్ధ సతీష్, రవీంద్రాచారి, సుజాత, ఆంజనేయులు, సైదులు, లక్ష్మయ్య, రవీందర్, జ్యోతి, బక్కయ్య, గుడుగుంట్ల రామకృష్ణ, ప్రవీణ్, కృష్ణ ఉన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రంలో లారీల కొరత

తిప్పర్తి : మండలంలోని గోదవారిగూడెం ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రానికి లారీల కొరత ఏర్పడింది. కాంటాలు వేసిన ధాన్యం ఎగుమతి చేసేందుకు లారీలు సరిగ్గా రావడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. రెండు లారీలు మాత్రమే వస్తున్నాయని..మిల్లుకు పోయి ధాన్యం దిగుమతి కాకుంటే తిరిగి రావడం లేదని పేర్కొన్నారు. కాగా సోమవారం ధాన్యం లోడ్ అయిన లారీ మామిడాల సమీపంలో రోడ్డుపై దిగబడింది. దీంతో గోదవారి గూడెం కేంద్రంలో ధాన్యం కాంటాలు వేసిన బస్తాలు అలాగే ఉండిపోయాయి. వర్షం వస్తే కాంటా వేసిన ధాన్యం బస్తాలు తడుస్తాయని రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. అధికారులు స్పందించి లారీల కొరత నివారించాలని కోరుతున్నారు.


గోదవారిగూడెంలో కాంటా వేసిన బస్తాలు


మామిడాల సమీపంలో దిగబడిన ధాన్యం లారీ

తడిసిన ధాన్యం.. నేలకూలిన చెట్లు


చండూరు : తడిసిన ధాన్యంపై పట్టాలు కప్పుతున్న రైతులు


నాంపల్లి కొనుగోలు కేంద్రంలో వర్షానికి తడిసిన ధాన్యం

చండూరు : అకాల వర్షం రైతుల పాలిట శాపంగా మారింది. వడగండ్ల వాన, ఈదురు గాలులు రైతులకు కన్నీరు మిగిల్చాయి. మంగళవారం చండూరులో పడిన వడగండ్ల వానతో కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం తడిసిపోయింది. ఈదురు గాలులకు ధాన్యంపై కప్పిన పట్టాలు ఎగిరిపోయాయి. వర్షం ప్రారంభం కాగానే కేంద్రానికి చేరుకున్న రైతులు తమ ధాన్యం ఎక్కువగా తడవకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. వరద నీరు ధాన్యం వైపు రాకుండా చిన్నచిన్న కాలువలు చేసి నష్టం ఎక్కువ కాకుండా చూసుకున్నారు. ఈదురు గాలులకు చండూరు పట్టణంలో విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. బంగారిగడ్డలో చండూరు వెళ్లే రోడ్డులో ఈదురు గాలులకు చెట్లు ఒరిగాయి. చండూరు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ దశరథనాయక్ సందర్శించారు.

మర్రిగూడ : మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం సాయంత్రం అకాల వర్షం కురిసింది. వరి పంటను కోసిన రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల వద్ద ఆరబెడుతున్నారు. వర్షం కారణంగా సమయానికి పట్టాలు లభించకపోవడంతో ధాన్యం తడిసి పలువురు రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

నాంపల్లి : అకాల వర్షానికి నాంపల్లి మండలంలో రైతుల పండించిన వరి ధాన్యం తడిసిపోయింది. నాంపల్లి మార్కెట్ యార్డులో 11 రోజుల క్రితం ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. 25 మంది రైతుల ధాన్యానికి తేమ శాతం వచ్చినా హమాలీలు లేక ఒక్క గింజ కూడా కొనుగోలు చేయలేదు. మంగళవారం అకాల వర్షం కురవడంతో పట్టాలు లేకపోవడంతో ధాన్యం అంతా తడిసి ముద్దయింది. ఉన్నతాధికారులు స్పందించి ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.


బంగారిగడ్డలో నేలకూలిన చెట్టు

ఉపాధి కూలీలకు అందని వేతనాలు

- రెండు నెలలుగా ఇబ్బందులు పడుతున్న కూలీలు
- అప్పులు చేసి కుటుంబ పోషణ
- త్వరగా డబ్బులు ఇవ్వాలని వేడుకోలు


సింగారంలో ఓ రైతు పొలంలో వరద కట్టలు పోస్తున్న ఉపాధి హామీ కూలీలు

మునుగోడు: గ్రామాల్లో వలసలను నివారించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీలో కూలీలకు సరియైన సమయంలో వేతనాలు అందడం లేదు. గ్రామాల్లో కూలీలకు ఏడాదికి 100 రోజుల పని కల్పించడం ఈ పథకం ఉద్దేశం. ఉపాధి హామీ పనులు చేసిన కూలీలకు వారం రోజులకు ఒకమారు పనికి తగ్గటుగా వేతనం డబ్బులు బ్యాంక్, పోస్టాఫీస్ ఖాతాల్లో జమచేయాలి. కానీ మునుగోడు మండలంలో రెండు నెలలుగా కూలీల డబ్బులు అందడం లేదు. దీంతో ఉపాధి హామీ పనికి వెళ్లి కుటుంబాన్ని పోషించుకునే కూలీలు పడరాని పాట్లు పడుతన్నారు.

11,639 జాబ్‌కార్డులు..

మునుగోడు మండల వ్యాప్తంగా 27 గ్రామాల్లో 11,639 జాబ్‌కార్డులు ఉన్నాయి. అందులో 24,412 మంది కూలీలు ఉన్నారు. అయితే అందులో ప్రతి ఏటా 7773 మంది కూలీలు ఉపాధి హామీ పనులకు హాజరవున్నారు. ప్రస్తుతం ఎండలు అధికంగా ఉండడంతో 2386 మంది కూలీలు మాత్రమే పనులకు వస్తున్నారు.

రెండు నెలలుగా అందని వేతనాలు..

మండల వ్యాప్తంగా ప్రస్తుతం రోజుకు 2386 మంది కూలీలు ఉపాధి హామీ పనులకు వస్తున్నారు. ఒక్కో కూలీకి సగటున రోజుకు రూ.230 చొప్పున వేతనం అందుతోంది. రోజుకు రూ. 5,48,780 చొప్పున రెండు నెలలకు దాదాపు రూ. 2,63,41440 చెల్లించాల్సి ఉంది. సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని డబ్బులు అందేలా చర్యలు తీసుకోవాలని మండలంలోని ఉపాధి హామీ కూలీలు కోరుతున్నారు.

అప్పులు చేయాల్సి వస్తోంది



మా గ్రామంలోని నర్సరీలో పనిచేస్తున్నా. గతంలో వారం, 15 రోజులకు అందించే కూలీ డబ్బులు రెండు నెలలుగా అందడం లేదు. దీంతో మా కుటుంబ పోషణకు అప్పులు చేయాల్సి వస్తోంది. అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని చేసిన పనికి డబ్బులు ఇప్పించాలి.

– సింగం నర్సింహ, పులిపలుపుల

రెండు నెలలుగా ఇవ్వడం లేదు



నేను రెండు నెలలుగా మా గ్రామంలో ఉపాధి హామీ కూలి పనికి వస్తున్నా. ఇప్పటివరకు నాకు కూలి డబ్బులు ఇవ్వలేదు. డబ్బులు ఎప్పుడు వస్తాయి అని అధికారులను అడిగితే చెప్పలేం అంటున్నారు. గతంలోలాగా వారం వారం డబ్బులు ఇస్తే బాగుండు.

– యాదమ్మ, సింగారం

బడ్జెట్ రాగానే ఖాతాల్లో జమ అవుతాయి



బడ్జెట్ లేకపోవడంతో రెండు నెలలుగా కూలీల ఖాతాల్లో నగదు జమ కావడం లేదు. ప్రభుత్వం బడ్జెట్ కేటాయించిన వెంటనే కూలీలకు అందాల్సిన నగదు పూర్తిగా వారి ఖాతాల్లో జమ అవుతాయి. ఈ విషయాన్ని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

– ఇంద్ల నాగరాజు, ఏపీఓ మునుగోడు

ఆదమరిస్తే అంతే సంగతులు..!


కేతేపల్లిలో డ్రెయినేజీపై పగిలిన స్లాబు

కేతేపల్లి: మండల కేంద్రంలో జాతీయ రహదారి పక్కన నిర్మించిన మురుగు కాల్వపై స్లాబు పగిలి ప్రమాదకరంగా మారింది. హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిని నాలుగు లేన్లుగా విస్తరించిన సమయంలో కేతేపల్లిలో సర్వీసు రోడ్డుకు జాతీయ రహదారికి మధ్యలో గ్రామం ఒక చివర నుంచి మరో చివర వరకు మురుగు కాల్వలు నిర్మించారు. మురుగు కాలవ్వపై సిమెంటు, కంకర మిశ్రమంతో తయారు చేసిన బిల్లలను స్లాబుగా వేశారు. కాగా స్థానిక బస్‌స్టేజీ సమీపంలో హైవే నుంచి సర్వీసు రోడ్డుపైకి రాకపోకలు సాగించే ద్విచక్ర వాహనాదారులు, ట్రాక్టర్లు, ఆటోలు మురుగు కాలవ్వపై నుంచి వెళ్తుండడంలో స్లాబు పగిలి ప్రమాదకరంగా ఉంది. పగిలిన వాటి స్థానంలో కొత్తవి వేసినా ట్రాక్టర్లు వంటి భారీ వాహనాలు వెళుతుండడంతో వారం రోజుల్లోనే అవి మళ్లీ పగిలిపోతున్నాయి. దీంతో రాత్రి వేళలో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. సంబంధిత అధికారులు స్పందించి ఎలాంటి ప్రమాదం జరగకముందే శాశ్వత ప్రాతిపదికన మరమ్మతులు చేయించడంతోపాటు ఇక్కడ నుంచి భారీ వాహనాలు వెళ్లకుండా నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.

రాంరెడ్డిపల్లిలో బడిబాట


బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

మర్రిగూడ : మండలంలోని రాంరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మంగళవారం ముందస్తు బడిబాట కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు కళా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని ఇంటింటికీ వెళ్లి కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మాస బాలరాజు, హైమావతి, శోభా, కృష్ణారెడ్డి, సుధారాణి, మృణాలిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.